క్లుప్తంగా

క్రైస్తవులకు కమ్యూనిటీహాల్ నిర్మించాలి


మాట్లాడుతున్న పాస్టర్లు

ఆదోని టౌన్: పట్టణంలో క్రైస్తవులకు అనుకూలంగా స్థల సేకరణ చేపట్టి కమ్యూనిటీహాల్ నిర్మించాలని కోరుతూ సోమవారం ఆదోని క్రిస్టియన్స్ యునైటెడ్ చర్చ్స్ అసోసియేషన్ నాయకులు, ఫాదర్‌లు మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణకు వినతి పత్రం అందజేశారు. పాస్టర్లు ఆనందరావు, క్రైస్తవులు దేవదానం, అమరనాథ, సుజ్ఞానమ్మ, థామస్, నరేష్ రమేష్ మాట్లాడారు. ఆదోని పట్టణంలో కమ్యూనిటీ హాళ్లు లేక క్రైస్తవులు వివాహాలకు, తదితర శుభ కార్యక్రమాల కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. క్రైస్తవుల ఇబ్బందుల దృష్ట్యా అధికారులు స్పందించి కమ్యూనిటీహాల్స్ నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా వీరభద్రకాళి విగ్రహ ప్రతిష్ట



నందవరం : మండలంలోని నాగలదిన్నె గ్రామంలో వీరభద్ర స్వామి దేవాలయంలో వీరభద్రకాళి మాత విగ్రహ ప్రతిష్టాపన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. వేద మంత్రోచ్ఛరణలతో వేద పండితులు వీరభద్ర స్వామి, పూజారి గణేష్ స్వామి ఆధ్వర్యంలో విగ్రహాల ప్రతిష్ట చేశారు. రెండు రోజుల పాటు వీరభద్ర హోమం, భద్రకాళి హోమం, ఆలయపూజ, ధ్యానదివాసం, శయ్యాధి వాసం, గణపతిపూజ, ప్రతరోపాసనము, విగ్రహ ప్రతిష్ట వంటి విశిష్ట పూజలు గావించారు. అనంతరం వేదమంత్రోచ్ఛణల మధ్య వేద పండితులు ఆలయ శికరం, భద్రకాళి మాత విగ్రహ ప్రతిష్టాపన చేశారు. భక్తులకు అన్నదాన కర్యాక్రమం చేపట్టారు.

విద్యార్థినికి బంగారు పతకం బహూకరణ


గోల్డ్‌మెడల్ బహూకరిస్తున్న రిటైర్డ్ ఏఎస్పీ బి.పెద్దయ్య

ఆదోని సెంట్రల్: పొలిటికల్ సైన్సులో అత్యధిక మార్కులను సాధించిన ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థిని ఇ.శిరీషకు విశ్రాంత అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు బి.పెద్దయ్య బంగారు పతకాన్ని బహూకరించారు. సోమవారం కళాశాలలో కరస్పాండెంట్ సీఏబీ దైవాదీనంరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఇదే కళాశాలలో తాను 1972లో బీఏ(డిగ్రీ)లో అత్యధిక మార్కులను సాధించి అప్పటి కళాశాల అధ్యక్షుడు టిజి.కృష్ణమూర్తి చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకున్నట్లు గుర్తు చేసుకున్నారు. దీనిని స్ఫూర్తిగా తీసుకొని తన భార్య బి. తాయమ్మ పేరు మీద పతకాన్ని బహూకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్, అధ్యాపకులు డా.అయ్యప్ప, డా.రంగనాథం, డా.రామకృష్ణ, విరూపాక్షి తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి


సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వార్డు సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని క్రాంతినగర్, ఎస్సీకాలనీ సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ నీరజ పాల్గొన్నారు.

కొత్త బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే


కొత్త బస్సులకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఆర్టీసీ డిపోకు మంజూరైన కొత్త బస్సులను సోమవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి పూజ చేసి ప్రారంభించారు. ఇప్పటి వరకు కొత్తగా 16 బస్సులు డిపోకు వచ్చాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ప్రీపెయిడ్ కరెంట్

- కసరత్తు ప్రారంభించిన విద్యుత్ శాఖ
- తొలుత ప్రభుత్వ కార్యాలయాలు, షాపులకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు
- ఆ తర్వాత గృహాలకు
- గ్రామీణ ప్రాంత వినియోగదారులకు అవస్థలు


గోనెగండ్లలో ఓ షాపులో ఏర్పాటు చేసిన నూతన స్మార్ట్ మీటర్

గోనెగండ్ల : వినియోగించే విద్యుత్ అవసరాలకు ముందుగానే రొక్కం చెల్లించేలా నూతన విధానం అమల్లోకి రానుంది. ప్రస్తుతం విద్యుత్ వాడకం అనంతరం ఎన్ని యూనిట్లు ఖర్చు చేశామో లెక్కకట్టి విద్యుత్ బిల్లు చెల్లిస్తున్నాం. త్వరలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనుండడంతో ముందస్తుగా రీచార్జ్ చేసుకుని వినియోగించుకోవాల్సి ఉంటుంది. అంటే మన సెల్‌ఫోన్‌కు ప్రీపెయిడ్ పద్ధతిలో ఏ విధంగా రీచార్జ్ చేసుకుని వాడుతున్నామో అదే విధానం అమలు కానుంది. బ్యాలెన్స్ అయిపోయిన వెంటనే రీచార్జ్ చేసుకోవాలి లేకపోతే చీకట్లో మగ్గాల్సిందే.

ప్రారంభమైన స్మార్ట్ మీటర్లు అమర్చే ప్రక్రియ

మండలంలో గృహ సర్వీసులు, వాణిజ్యం, పరిశ్రమలు, ప్రభుత్వ సర్వీసులు, వ్యవసాయం, వీధి దీపాలు, ఆర్‌డబ్ల్యూఎస్, హెచ్‌టీ మొత్తం కలిసి దాదాపు 25,956 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలకు అనుగుణంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు సంబంధించిన చర్యలను రాష్ట్ర ప్రభుత్వం ముమ్మరం చేసింది. త్వరలోనే అన్ని రకాల విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసేలా నిర్ణయించింది. ముందుగా అన్ని ప్రభుత్వ, కమర్షియల్ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్ల అమరిక ప్రారంభమైంది. మండలంలో ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలకు, షాపులకు స్మార్ట్ మీటర్లను అమరుస్తున్నారు. ఇప్పటి వరకు 130 కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లను అమర్చారు. 2025 జనవరికి అన్ని రకాల విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్ల అమర్చాలనే నిర్ణయంతో అధికార యంత్రాంగం అడుగులు వేస్తోంది. ఈ నూతన విధానం ద్వారా ప్రీపెయిడ్ మీటర్లకు ముందుగానే రీచార్జ్ చేయాల్సి ఉంటుంది. అలా చేయకపోతే సరఫరా కట్ అయిపోతుంది. ఇప్పటి వరకు అమలవుతున్న విధానానికి అలవాటుపడిన వినియోగదారులకు దీనిపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

ప్రస్తుతానికి ప్రభుత్వ కార్యాలయాలు, షాపులకు..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రస్తుతం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, షాపులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నాం. మండలంలో ఇప్పటి వరకు 130 స్మార్ట్ మీటర్లను కార్యాలయాలు, షాపులకు ఏర్పాటు చేశాం. దశల వారీగా అన్ని కేటగిరి సర్వీసులకు అమలు చేయనున్నాం. వీటి ద్వారా రీడింగ్ యూనిట్లను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. – సుధాకర్ రావు, విద్యుత్ ఏఈ, గోనెగండ్ల

బడుగులపై భారం

ప్రస్తుతం మనం ఈనెల వినియోగించిన కరెంట్ బిల్లు మరుసటి నెల చెల్లిస్తున్నాం. బిల్లు పొందిన 15 రోజుల వరకు అపరాధ రుసుం ఉండదు. జరిమానాతో మరో 15 రోజుల్లో బిల్లు చెల్లించడానికి సమయం ఉంటుంది. ఈ లెక్కన వినియోగదారుడికి బిల్లు చెల్లించడానికి దాదాపు నెల వరకు సమయం ఉండే ఈ పద్ధతినే అనుసరిస్తున్నాం. అయితే నూతన ప్రీపెయిడ్ విధానం బడుగులకు భారం కానుంది. విద్యుత్ వినియోగదారుల్లో మధ్య తరగతి వారి కంటే బడుగులే అధికంగా ఉంటారు. వారు వినియోగించే విద్యుత్ సంబంధించి ముందుగా మొత్తం చెల్లించాలంటే వారికి భారమే. ప్రస్తుత రోజుల్లో క్షణం విద్యుత్ లేకుండా ఉండడం కష్టం. ఈ తరుణంలో ప్రీ పెయిడ్ మీటర్ల వినియోగంతో ఇబ్బందులు తప్పేలా లేవు.

ప్రీపెయిడ్ విధానంతో ఇబ్బందులు..

- ఈ నూతన విధానంతో గ్రామీణ ప్రాంత వినియోగదారులు అవస్థలు పడే అవకాశాలున్నాయి.
- చాలా మంది పేదవారివద్ద స్మార్ట్ ఫోన్లు అందుబాటులో లేవు. దీంతో వారు రీచార్జ్ సామాచారం తెలిసే సౌకర్యం వారి వద్ద ఉండదు. వారికి రీచార్జ్ ఎలా చేసుకోవాలో తెలియక ఇబ్బందులు పడే అవకాశం ఉంది.
- స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు అందుబాటులోకి వస్తుండడంతో దీని ప్రభావం విద్యుత్ మీటర్ రీడర్లపై పడనుంది. వీరంతా ఉపాధి కోల్పోయే అవకాశం ఉంది.
- విద్యుత్ చౌర్యం పెరిగే అవకాశం ఉంది. లైన్ల నుంచి విద్యుత్‌ను అక్రమంగా వాడుకునే వారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

రాత్రి సమయంలో రీచార్జ్ అయిపోతే ఎలా



ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఒకవేళ రాత్రి సమయంలో రీచార్జ్ అయిపోతే కరెంట్ కట్ అయిపోతుంది. నాకు రీచార్జ్ చేయడం కూడా తెలియదు. రాత్రంతా చీకటిలో ఉండాల్సిందేనా. ప్రభుత్వం స్పందించి మాలాంటి వారికి ఉన్న మీటర్లనే కొనసాగించాలి. – తిరుమల రెడ్డి, గంజిహళ్లి గ్రామం

గ్రామీణ ప్రాంతాల్లో ఇబ్బందులు



గ్రామీణ ప్రాంతాల్లో ఈ స్మార్ట్ మీటర్ల వల్ల ఇబ్బందులు తప్పవు. పట్టణంలో ఉన్న వారికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు. గ్రామీణ ప్రాంతాల్లో రీచార్జ్ అయిపోతే ఇల్లు అంధకారంలో ఉండాల్సిందే. రీచార్జ్ చేయాలంటే సెల్‌ఫోన్ దుకాణానికి వెళ్లాలి. – జహంగీర్, పెద్దనేలటూర్ గ్రామం

ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు


సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం–పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరచాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం–పీజీఆర్ఎస్ నిర్వహించి డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ కె.వసుంధర, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్స్ శ్రీనివాసరావు, వేణుసూర్య, గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరిస్తున్న ప్రభుత్వాలు


మాట్లాడుతున్న జిల్లా కార్యవర్గ సభ్యుడు రాధాకృష్ణ

కౌతాళం: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను విస్మరిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సొంత అజెండాతో ముందుకు పోతున్నాయని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాధాకృష్ణ అన్నారు. కౌతాళం మండల సీపీఎం పార్టీ 7వ మహాసభలు సోమవారం మండల పరిధిలోని ఎరిగేరి గ్రామంలో గ్రామ నాయకుడు వీరేష్ అధ్యక్షతన జరిగాయి. ముందుగా దివంగత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సభకు ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించకుండా కులాలు, మతాలు, దేవుళ్లు, గుళ్ల పేరుతో ప్రజలను మభ్యపెడుతూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తుంగభద్ర నదికి ప్రతి ఏడాది వరదల వల్ల 70 నుంచి 100టీఎంసీలు వరకు నీరు వృథాగా సముద్రంలో కలుస్తున్నాయని, ఆ నీటిని సద్వినియోగం చేసుకుంటే జిల్లా పశ్చిమ భాగం సస్యశ్యామలమవుతుందన్నారు. తుంగభద్ర నదిపై వరద కాలువ నిర్మిస్తే వరదలు నివారించవచ్చని రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ సుబ్బారాయుడు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం స్పందించి వరద కాలువ నిర్మించాలన్నారు. మహాసభలో సీపీఎం సీనియర్ నాయకుడు మల్లయ్య, మండల కన్వీనర్ ఈరన్న, రామలింగ, వీరేష్, నాగరాజు, చిన్నమారయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు


ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం జాప్యం వహించడం తగదని ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజేంద్ర, నారాయణ, శివరామకృష్ణ, నరసప్ప అన్నారు. తమ సమస్యల సాధనలో భాగంగా 12వ రోజు పట్టణంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జాకీర్, వీరేష్, శివన్న, జనార్దన్, రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలి

ఆదోని రూరల్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలను రూ.28 వేలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పి.ఈరన్న, పట్టణాధ్యక్షులు తిప్పన్న, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సోమన్న, పీరా డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ పంప్ హౌస్ నుంచి ర్యాలీగా స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంకు చేరుకుని ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కృష్ణమూర్తి, కైలాసబాషా, దేవేంద్ర, శివ, కర్రెప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉరుకుందలో ఘనంగా రుద్ర హోమం


ఈరన్నస్వామి

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో సోమవారం రుద్ర హోమం కార్యక్రమాన్ని భక్తుల మధ్య ఘనంగా చేపట్టారు. అరుద్ర నక్షత్రంలో రుద్రహోమం నిర్వహించడం వల్ల శుభాలు జరుగుతాయని ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. హోమంలో పాల్గొనే జంటలకు దేవాలయం వారు రూ.1500 నిర్ణయించడంతో చాల మంది భక్తులు తరలివచ్చి హోమ కార్యక్రమంలో పాల్గొంటున్నారన్నారు.

ఉరుకుందకు పోటెత్తిన భక్తులు

ఈరన్నస్వామిని దర్శించుకునేందుకు భక్తులు సోమవారం పోటెత్తారు. సోమవారం కావడంతో పాటు హోమం కూడా కలిసి రావడంతో భక్తులు తమ ఇంటి ఇలవెల్పును దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు

కౌతాళం: స్థానిక సమీకృత అభివృద్ధి లక్ష్యాలు, కార్యాచరణ ప్రణాళికపై మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులకు రెండు రోజుల శిక్షణ తరగతులను మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. కుంటనహాల్, అగసలదిన్నె, లింగాలదిన్నె, నదిచాగి, పొదలకుంట, రౌడూరు, బంటకుంట, తోవి, ఉప్పరహాల్, ఉరుకుంద, వల్లూరు, ఎరిగేరి గ్రామాల సర్పంచులతో పాటు ఆయా గ్రామాల కార్యదర్శులు కూడాశిక్షణ తరగతుల్లో పాల్గొనాలని ఆదేశించారు.

దుప్పట్ల పంపిణీ


వృద్ధురాలికి దుప్పటి అందజేస్తున్న సాయిభక్త బృందం సభ్యులు

ఆదోని అర్బన్: పట్టణంలోని వైఎంకే కాలనీలో వెలిసిన సాయిబాబా మందిరంలో సోమవారం సాయిభక్త బృందం వారు వృద్ధులకు, అనాథలకు, వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. సాయిభక్త బృందం సభ్యులు వీరయ్యస్వామి, ప్రసాద్, సింగర్ రాము మాట్లాడుతూ సాయిబాబా అనుగ్రహం వల్ల 30 సంవత్సరాల నుంచి ఇలాంటి సేవ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. సుమారు 250 మందికి దుప్పట్లు అందజేశామన్నారు. ముఖ్య అతిథిగా టీజీ పాండయ్య పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో సాయి భక్త బృందం సభ్యులు డోలక్ చిరు, ధర్మారెడ్డి, పూజారి మల్లయ్యస్వామి, శివస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓపై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: మండల పరిధిలోని పార్లపల్లె గ్రామంలో 8వ తరగతి విద్యార్థినిపై దాడి చేసిన ఘటనపై విచారణ చేసి ఎంఈఓ –2పై తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం డిప్యూటీ డీఈఓ వెంకటరమణారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ ఆంజినేయులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ప్రకారం వేతనాలివ్వాలి

ఎమ్మిగనూరుటౌన్: విద్యుత్ శాఖలో పనిచేసే మీటర్ రీడర్లకు కాంట్రాక్ట్ చేసుకున్న ప్రకారం వేతనాలు ఇవ్వాలని విద్యుత్ మీటర్ రీడర్స్ యునియన్ వర్కింగ్ ప్రసిడెంట్ నరసింహారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు వీరేష్, ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి విజయేంద్ర డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో డీఈ విజయరాజుకు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ కాంట్రాక్టర్ తన ఇష్టానుసారంగా వేతనాలు ఇస్తున్నాడని ఆరోపించారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం పట్టణ ప్రాంతంలో రూ.3.61పైసలు, గ్రామీణ ప్రాంతంలో రూ.3.73పైసలు ఇవ్వకుండా కాంట్రాక్టర్ రూ.3, రూ.3.13పైసలు ఇస్తూ కార్మికుల కడుపు కొడుతున్నాడన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు చంద్రశేఖర్, భీమేష్, కిరణ్, శ్రీకాంత్, వీరేష్, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

18న స్వర్ణామృత ప్రాసనం పంపిణీ

ఆదోని అర్బన్: పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయంలో ఈనెల 18వ తేదీన అవోపా ఆధ్వర్యంలో స్వర్ణామృత ప్రసానం మందును పంపిణీ చేస్తున్నట్లు అవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 18వ తేదీన ఉదయం 7 గంటలకు చిన్నారులకు ఈ మందును అందించడం జరుగుతుందన్నారు. ఈ మందు చిన్నారుల్లో రోగ నిరోధకశక్తి, మేధాశక్తి, పెంచుతుందన్నారు. అలాగే మానసిక, శారీరక ఎదుగుదలకు దోహదమవుతుందన్నారు. మందు కావాల్సిన వారు 9849478178 నంబర్‌కు ఎస్ఎంఎస్ లేదా వాట్సాప్ ద్వారా సంప్రదించి రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

కోసిగి ఆసుపత్రిని 30 పడకలకు పెంచాలి

కోసిగి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సీపీఐ మండల కార్యదర్శి గోపాల్, డీహెచ్‌పీఎస్ జిల్లా సహాయక కార్యదర్శి ఓంకార్ స్వామి, రైతు సంఘం మండల అధ్యక్షులు హెచ్ మూకప్ప, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ కోరారు. సోమవారం స్థానిక ప్రాథమిక కేంద్రం ఎదుట సీపీఐ అనుబంధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ హాస్పిటల్‌లో అత్యధికంగా ప్రసవాలు జరుగుతున్నాయని, కేవలం 9 బెడ్లు మాత్రమే ఉన్నాయన్నారు. చాల సమయంలో ప్రవసాలకు వచ్చిన మహిళలు మంచాలు చాలక కాన్పు అయిన బాలింతలను అబ్జర్వేషన్‌లో ఉంచుకుండా తొందరగా ఇంటికి పంపించి ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ధర్నాలో సీపీఐ నాయకులు దివాకర్, మహాదేవ, రమేష్, ఉలిగప్ప తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల్లో ముమ్మర తనిఖీలు


పట్టుబడిన ప్లాస్టిక్ కవర్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ

ఆదోని టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని వ్యాపార సముదాయాలపై సోమవారం మున్సిపల్ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ కవర్లపై దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో 46 కేజీల ప్లాస్టిక్ కవర్‌లను స్వాధీనం చేసుకుని, ఆ దుకాణాలకు రూ.10,200 జరిమానా విధించినట్లు కమిషనర్ తెలిపారు. షాపుల్లో 120 మైక్రాన్స్ లోపు గల ప్లాస్టిక్ కవర్‌లను మాత్రమే వాడాలన్నారు. అంతకుమించి వాడితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అలాగే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం


రైతుల భూ సమస్యలపై ఆరా తీస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్


కనకవీడులో గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

ఆదోని రూరల్: రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలు పరిష్కారమవుతాయని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. సోమవారం మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలు ఉన్న రైతులు రెవెన్యూ సదస్సుల్లో అర్జీల రూపంలో దరఖాస్తులు చేసుకోవాలని, వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాముడు, డిప్యూటీ తహసీల్దార్ పెద్దయ్య, మండల సర్వేయర్ ఈశ్వర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

నందవరం : భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. సోమవారం మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో రెవెన్యూ అధికారులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ..ప్రజా సమస్యలను అర్జీల రూపంలో అందిస్తే పరిష్కారం చూపుతామన్నారు. గ్రామంలో వివిధ రకాల సమస్యలపై 34, సర్వే సులపై 4 అర్జీలు అందాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్ డీటీ మహేష్, ఆర్ఐ జెర్మియా, మండల సర్వేయర్ అక్బర్‌బాషా, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలి


స్టడీ మేటిరియల్ ప్రదానం చేస్తున్న అధ్యాపకులు

కౌతాళం: ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలని కౌతాళం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ అన్నారు. ఇంటర్‌బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు బోర్డు సంకల్ప్ పేరుతో విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చి నెలలో జరిగే ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా స్టడీ మెటీరియల్‌ను అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డేవిడ్, శ్రీనివాసరెడ్డి, ప్రకాశ్ రాజ్, రాఘవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదోని మున్సిపల్ బడ్జెట్ రూ.81.28 కోట్లు

ఆదోని టౌన్: 2025–26 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.81.28 కోట్లతో ఈనెల 18వ తేదీన జరగనున్న మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆదోని మున్సిపల్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్‌లో మున్సిపాలిటీకి వివిధ పథకాల ద్వారా జమ అయ్యే నిధులు, మున్సిపల్ జనరల్ ఫండ్స్, ఆస్తి, నీటి పన్నుల ద్వారా వచ్చే ఆదాయం మొత్తం కలుపుకుని నిధులను కేటాయించామన్నారు. గతేడాది బడ్జెట్ రూ.61.44 కోట్లు కాగా, ఈ ఏడాది 20 శాతం అధికం కాగా, రూ.81.28 కోట్లుకు పెంచినట్లు తెలిపారు. బడ్జెట్ సమావేశంలో వాటర్ వర్క్ సెక్షన్‌కు రూ.19 కోట్లు, శానిటేషన్ విభాగానికి రూ.18 కోట్లు, ఆదోని అభివృద్ధికి రూ.31 కోట్లు, విద్యుత్ దీపాలకు రూ.4 కోట్లు, ఇతర పనులకు రూ.10 కోట్లు మేర కేటాయించినట్లు వెల్లడించారు.

కర్ణాటక వాహనం సీజ్

ఆదోని అర్బన్: కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లాకు చెందిన మినీ బస్సును సోమవారం పెద్దతుంబళం గ్రామ సమీపంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిసిరాదీప్తి సీజ్ చేశారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారి నుంచి మంత్రాలయం పుణ్యక్షేత్రానికి వెళ్లి తిరిగొస్తుండగా పెద్దతుంబళం గ్రామ సమీపంలో తనిఖీ చేయగా వాహనానికి పర్మిట్, ఆంధ్ర ట్యాక్స్ లేకపోవడంతో రూ.80 వేలు జరిమానా వేసి బస్సును సీజ్ చేశారు. ఆ వాహనంలోని 25 మంది విద్యార్థులు బస్సులో మంత్రాలయం పుణ్యక్షేత్రానికి వెళ్లినట్లు చెప్పారు. వాహన యజమాని రూ.80 వేలు పెనాల్టీ చెల్లించగా.. అదే వాహనంలో విద్యార్థులు తరలివెళ్లారు.

అప్రమత్తతతో క్షయవ్యాధి దూరం


మాట్లాడుతున్న డాక్టర్ అనిల్‌సాగర్

ఆదోని టౌన్/ఆదోని సెంట్రల్: అప్రమత్తతోనే క్షయవ్యాధి నయమవుతుందని డాక్టర్లు షేకున్‌బాను, సమీమ్‌బేగం, అనిల్ సాగర్, వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని అరుంజ్యోతినగర్, షరాఫ్‌బజార్, అమరావతి నగర్, హనుమాన్ నగర్‌లలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లలో క్షయవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. క్షయవ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డాక్టర్లు మాట్లాడుతూ.. వ్యాధి నిర్ధారణ కోసం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రుల్లో టీబీ యూనిట్‌లో గళ్ల, రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ తర్వాత వ్యాధిగ్రస్తునికి ఉచితంగా ఆరు నెలలకు సరిపడే మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతినెలా రూ.500 ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు
97054 44304 (ఆదోని)
70750 09147 (ఎమ్మిగనూరు, మంత్రాలయం)
Office mail : sakshiknladvt@gmail.com